సాక్షి
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025

## రోడ్డుకు దూరంగా మొక్కలు నాటాలి



నూతన్‌కల్ రోడ్డు పక్కనే తవ్విన గుంతలు

**మేడ్చల్:** ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలో డబీల్‌పూర్ నుంచి గుండ్లపోచంపల్లికి వెళ్లే రోడ్డులో మున్సిపల్ అధికారులు నాటుతున్న మొక్కలను రోడ్డుకు దూరంగా నాటాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు. రోడ్డుకు మరింత దగ్గరగా మొక్కలు నాటేందుకు మున్సిపల్ సిబ్బంది ఇప్పటికే గుంతలు తవ్వారు. తవ్విన గుంతలు వదిలేసి రోడ్డుకు దూరంగా విద్యుత్ తీగల కింద లేకుండా గుంతలు తీసి మొక్కలు నాటాలని కోరుతున్నారు.

## గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ



**ఘట్‌కేసర్:** మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ (2025–2027) మున్సిపల్‌శాఖ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోతీలాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌నాయక్, కోశాధికారిగా పురుషోత్తంనాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోర్ సమాజ శ్రేయస్సు, సమగ్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని, సభ్యులందరూ సహకరించాలని కోరారు. గోర్ సమాజ అభివృద్ధికి కార్యాచరణ, విద్య, ఉపాధి అవకాశాల ప్రోత్సాహం, సాంస్కృతిక సంప్రదాయాల సంరక్షణ, సేవా కార్యక్రమాలకు చేయూత, యువకుల్లో ఐకమత్యం, చైతన్యం కల్పించాలని తీర్మానించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. వెంకన్ననాయక్, రవినాథ్‌నాయక్, భూక్యానాయక్, బిక్కునాయక్, గోర్ మాజీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



# ఉద్యాన పంటలకు పోత్సాహమేది?

- ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే హార్టికల్చర్ హబ్
- ప్రతిపాదనలకే పరిమితంపై రైతుల్లో ఆందోళన
- అమలైతే 30 వేల ఎకరాల్లో అదనపు సాగుకు అవకాశం




**సాక్షి,మేడ్చల్ జిల్లా:** నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తేనే మోక్షం లభించని పరిస్థితి నెలకొంది. జిల్లాల్లో సాగవుతున్న ప్రస్తుత ఉద్యాన పంటకు అదనంగా 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంటసాగును పెంచాలని హార్టికల్చర్‌శాఖ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలను రూపొందించింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించినా.. నిధుల సమస్య అడ్డంకిగా మారింది. దీంతో అదనంగా ఉద్యానవన పంట సాగుపై రైతులు ఏమీ..? చేయలేని పరిస్థితి నెలకొంది.

### ఆదేశాల మేరకే అప్పట్లో ప్రతిపాదనలు

నగర శివారు హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఉద్యానశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇప్పటి వరకు మోక్షం లభించకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు.

### మూడేళ్లలో రూ.250 కోట్లు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రాజెక్ట్ నిర్వహణ కింద మూడేళ్ల వ్యవధిలో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 2020 అక్టోబర్‌లో అధికార యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 99 వేల ఎకరాల వ్యవసాయ (పంటసాగు) భూమి ఉండగా.. ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యాన పంటను రైతులు సాగు చేస్తున్నారు. మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూడేళ్లలో అదనంగా 30 వేల ఎకరాల్లో ఉద్యానవన (హార్టికల్చర్ ) పంటసాగు చేయొచ్చని అధికార యంత్రాంగం ప్రతిపాదనలను రూపొందించటంతో పాటు ప్రతిఏటా 10 వేల ఎకరాల చొప్పున దశలవారీగా మూడేళ్లలో 30 వేల ఎకరాల్లో హార్టికల్చర్ పంటసాగు పెంచవచ్చని పేర్కొంది. హార్టికల్చర్ శాఖలో ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బందికి తోడు అదనంగా ఏడుగురు హార్టికల్చర్ అధికారులు, 10 మంది హెచ్‌ఈఓ పోస్టులు మంజూరు చేయాలని యంత్రాంగం సూచించింది.

– హార్టికల్చర్ హబ్ అభివృద్ధిపై రాష్ట్ర ఉన్నతాధికారులకు ఉద్యాన శాఖ ప్రతిపాదనలు సమర్పించి ఏళ్లు గడచినా.. ఇప్పటి వరకు మోక్షం లభించకపోవడంతో ఈ ప్రాజెక్టుపై నీలి నీడలు అలుముకున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం రైతులపై ఉన్న ప్రేమతో నిధులు విడుదల చేస్తే.. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. హార్టికల్చర్ శాఖలో అవసరమైన అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

## ఇంజనీరింగ్ లీడర్లుగా ఎదగాలి

**కీసర:** నాగారం మున్సిపాలిటీ పరిధి భోగారంలోని హోలీమేరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్ క్యాంపస్)లో నిర్వహించిన ఓరియంటేషన్ డే కార్యక్రమానికి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరిన విద్యార్థులు కేవలం ఇంజినీర్లుగా కాకుండా లీడర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వేశ్వరయ్య, అబ్దుల్‌కలాం, కురియన్, వరప్రసాదరెడ్డి, సత్యనాదేళ్ల వంటి వారు తాము ఇంజనీర్లుగా కాకుండా ఇంజనీర్ లీడర్లుగానే అత్యున్నత స్థానాన్ని అధిరోహించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, డీన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలి

**సాక్షి, మేడ్చల్ జిల్లా:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వ్యవసాయ కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద కూలీలు అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్, అధ్యక్షుడు రాములు, నాయకులు స్వరూపానాయక్, యాదగిరి, ఎల్లయ్య, వెంకటేష్‌యాదవ్, శ్రీశైలం యాదవ్, జయమ్మ, సురేష్ పాల్గొన్నారు

## ప్రజావాణిలో కలెక్టర్‌కు 86 ఫిర్యాదులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు, బస్తీల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్ మనుచౌదరికి దరఖాస్తులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలకు ఓర్చుకుని తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. తిరస్కరించే దరఖాస్తులకు గల కారణాలను తప్పనిసరిగా దరఖాస్తులకు తెలపాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజావాణిలో 86 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ ప్రకటించారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పక్కింటి వ్యక్తి దాడిలో గాయపడి..

– చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



భాస్కర్ మృతదేహం

**ఘట్‌కేసర్:** పక్కింటి వ్యక్తి దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, బోయిగూడకు చెందిన భాస్కర్ నెలరోజుల క్రితం ఉపాధికోసం ఘట్‌కేసర్‌కు వచ్చి అంబేడ్కర్‌నగర్‌లో ఉంటూ కూలీపని చేసుకునేవాడు. ఈ క్రమంలో అతడు ఇంటి పక్కన నివసించే బిహార్‌కు చెందిన సింగారం మణిదీప్ అతడితో తరచూ గొడవపడేవాడు. ఆదివారం సాయంత్రం భాస్కర్‌ను దూషించడంతో తోటి కార్మికుడు దాసు ఇరువురికి నచ్చ చెప్పాడు. ఆదివారం తిరిగి రాత్రి 9 గంటలకు తిరిగి గొడవకు దిగాడు. ఈ క్రమంలో మణిదీప్ కత్తితో భాస్కర్‌పై దాడి చేశాడు. వెంటనే స్పందించిన దాసు, బాధితుడి భార్య, నిందితుడితో కలిసి ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భాస్కర్ రాత్రి 11.20 మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆందోళన



**సాక్షి, మేడ్చల్ జిల్లా :** దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, దివ్యాంగులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అర్హులందరికీ పెన్షన్ వెంటనే అందజేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్‌వై.అశోక్, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలి

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** మేడ్చల్–మల్కాజిగిరిజిల్లా ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు రవిచంద్ర, రవీందర్, కోల వెంకటేశ్వర్లు, మోతే వెంకట్‌రెడ్డి, పన్నాల బాల్‌రెడ్డి, రచ్చ శ్రీనివాస్, శ్రీరాములు, రేణుయాదవ్ ఉన్నారు.

# ఉపాధ్యాయులతో గౌరవంగా మెలగాలి



నాగారం జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల దినోత్సవంలో అధ్యాపక బృందం



ట్రోఫీని అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, చంద్రారెడ్డి

**కీసర:** ఉపాధ్యాయుల వట్ల విద్యార్థులకు గౌరవం ఉండాలని మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం జిల్లా పరిషత్ స్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నతికి ప్రత్యక్షం, పరోక్షంగా ఉపాధ్యాయులే కారణమన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్‌కుమార్, రఘు, శ్రీదేవి, సుమతి, సంధ్యారాణి, అజిత్‌అహ్మద్, మలోత్‌నాయక్, వందన, పద్మ, వరమ్మ, సత్యశ్రీ, సరిత, సంజయ్‌రాణి, అర్చన, సుప్రజ, పాండురంగారెడ్డి, గాయత్రి, స్థానిక నేతలు రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

**విద్యార్థులు పట్టుదలతో చదవాలి**

**కీసర:** విద్యార్థులు పట్టుదలతో చదవాలని కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు అన్నారు. కీసర మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన నాగారం జిల్లా పరిషత్ పాఠశాలకు ఎస్ఎస్‌సీ ఛాలెంజ్ ట్రోఫీ, రూ.11 వేల నగదును అందజేశారు. ఈ ట్రోఫీని ప్రవేశపెట్టిన ప్రముఖ న్యాయవాది బోడ శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, సాయినాథ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువులను పరిరక్షించాలి


### కలెక్టరేట్ ఎదుట ఏదులాబాద్ మత్స్య సంఘం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ద్వారా వచ్చే రసాయన కలుషిత జలాలు, చర్లపల్లి ఇండస్ట్రీ ఏరియా రసాయనాలతో సహా నాగారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల మురుగు ఎర్రమల్లె వాగు ద్వారా ఏదులాబాద్ చెరువులో కలుస్తున్నాయి. దీంతో చెరువులోని రూ.లక్షలాది విలువ చేసే చేపలు చనిపోతున్నాయని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఆందోళన చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఏదులాబాద్ చెరువులో చేపల పెంపకంపై 350 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తుండగా.. వీరిపై ఆధారపడి వేయిమంది ప్రజలు పొట్టపోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు పశువులతో సహా ప్రజలు తాగు నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఎర్రమల్లె వాగు నీటిని ఘన్‌పూర్ మీదుగా మూసీలో కలపాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు అనుమతితో 10 మంది మత్స్య సంఘం సభ్యులు జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ మన్నె రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి వినతిపత్రం అందజేశారు.

# సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



**కీసర:** వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ ఆర్.పుష్పలత ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర గురుకుల బాలికల స్కూల్, కళాశాలలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి గృహ కంపోస్టింగ్ అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, భూగర్భ, ఓపెన్ నాలాలను శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలు, పిచ్చిమొక్కలు తొలగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాల మురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు, కార్యాలయం సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తడి,పొడిచెత్తపై విద్యార్థులకు..**

**మేడ్చల్‌రూరల్:** ప్రతి విద్యార్థి తడిపొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు తడి,పొడిచెత్త, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యం, ఈఈ నర్సింహరెడ్డి, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటగోపాల్

## తాగునీటి సౌకర్యం కల్పించాలి



కమిషనర్ నిత్యానందకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

**పోచారం:** అన్నోజిగూడలో వికలాంగుల కాలనీవాసులకు తాగునీటి వసతి కల్పించాలని కోరుతూ పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌కు సీపీఐ నేతలు లొట్టి ఈశ్వర్, జయచంద్ర సోమవారం వినతిపత్రం అందజేశారు. వికలాంగుల కాలనీలోని 19 బ్లాకుల్లో మొత్తం 298 ఫ్లాట్లు ఉన్నాయని, ఈ కాలనీకి పక్కనే ఉన్న మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్ నుంచి నల్లా కనెక్షన్లు ఇప్పించాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలి



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

**మేడ్చల్:** మేడ్చల్‌లో శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం, అద్దె భవనంలో సాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాలని బీజేపీ నేతలు కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. రెండు శాఖల కార్యాలయాలకు భవనాలు నిర్మించి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. బీజేపీ నేతలు ప్రేమ్‌దాస్, వంశీ, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, పుష్ప, అర్జున్, మహేష్ తదితరులున్నారు.

## శ్మశానవాటిక స్థలం కబ్జాపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మల్లికార్జున్‌స్వామి

**మేడ్చల్:** పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల వెనుక ఉన్న జంగమ కులస్తుల శ్మశానవాటిక స్థలాన్ని పట్టణానికి చెందిన కొందరు పెద్దలు రియల్‌ఎస్టేట్ పేరుతో ఆక్రమించి సమాధులు తొలగించారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వందేళ్ల నుంచి పట్టణానికి చెందిన జంగమ కులస్తులు అక్కడ అంత్యక్రియలు చేసి సమాధులు నిర్మించగా.. కొంతమంది దౌర్జన్యంగా సమాధులు తొలగించారని జంగమ కులనాయకుడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్ స్వామి ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



విజయపురికాలనీలో పర్యటిస్తున్న డీఈ సంతోష్

**కీసర:** నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు విజయపురి కాలనీలో సోమవారం మున్సిపల్ డీఈ సంతోష్ కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని అనురాగ్ సిరి రెసిడెన్సీలో ఉన్న డ్రైనేజీ, నీటి సమస్యలను కాలనీవాసులు ఆయనకు తెలియజేశారు. ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



**మేడిపల్లి:** గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ దేవేందర్‌నగర్ ఫేజ్–2లో మహారాష్ట్రకు చెందిన కంబ్లె మాధవ్(39) కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం చెంగిచెర్ల చౌరస్తా వద్ద వరంగల్ హైవేలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రేపు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్

**ఘట్‌కేసర్:** 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఘట్‌కేసర్ జోనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్, క్రీడాకారుల ఎంపిక ఈనెల 10న నిర్వహించనున్నట్లు జోన్ కార్యదర్శి, పీడీ శ్రీరాములు తెలిపారు. 14 ఏళ్లలోపు(అండర్–14) బాలబాలికలు జనవరి 1, 2012 తర్వాత జన్మించిన వారు, 17 ఏళ్లలోపు(అండర్–17) బాలబాలికలు జన వరి 1, 2009 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పెన్ నెంబర్‌తో ఒరిజినల్ బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్‌తో అన్నోజిగూడ యాదాద్రి పార్కు, గాయత్రి ఆలయం దగ్గర బుధవారం ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. అదనపు సమాచారం కోసం 9390068408, 9542026432.

## స్థానిక సమస్యలపై సీపీఐ ధర్నా

**జవహర్‌నగర్:** వర్షాల కారణంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో దెబ్బతిన రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు తదితర సమస్యలను పరిష్కరించాలని సోమవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. చెన్నాపురం నుంచి వికలాంగుల కాలనీ వరకు వీధిదీపాలు పనిచేయడం లేదని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ నాగేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు సీహెచ్. దశరథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు, గిరిజన సమైఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప్‌నాయక్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు జయమ్మ, సీపీఐ నేతలు కురుమయ్య, సూర్యం, గంగారం, రాజునాయక్, మల్లిక, నాగేష్, సురేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు